నమస్తే తెలంగాణ
నిజామాబాద్, బుధవారం 26 జూన్ 2024
WEDNESDAY, JUNE 26, 2024

# ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

**పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన**

ఖలీల్‌వాడి, జూన్ 25 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఆందోళన చేపట్టి, డీఈవో దుర్గా ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా నాయకులు గణేశ్, అనిల్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియమించకుండా విద్యార్థుల సంఖ్య ఎలా పెరుగుతుందని ప్రశ్నించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో క్వాలిఫికేషన్ లేని టీచర్లు బోధిస్తున్నా జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఫీజుల పేరిట దోచుకుంటున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు వివరాలను ప్రదర్శించాలని, అనుమతులు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల పేర్లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అషూర్, బి. చందు, నిఖిల్, మహిపాల్, మమత, జంపన్న పాల్గొన్నారు.

**కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి**

జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం డీఐఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, జిల్లా ఇంటర్ విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్‌ల పేరుతో రూ.2 లక్షల వరకు ఫీజులు వసూ చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ధర్పల్లి, జూన్ 25 : కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ సభ్యుడు కరాటే రమేశ్, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను మూడు నెలల్లో అమలుచేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ – 'డి' నుంచి 'ఏ'లోకి మార్చాలని, బీసీ కులగణన చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రఘు రాం, నాయకుడు లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

## 'చలో హైదరాబాద్'కు తరలిన దివ్యాంగులు

రుద్రూర్, జూన్25: తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో మంగళవారం చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి రుద్రూర్ మండల దివ్యాంగులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ రూ. 4వేల నుంచి రూ. 6వేలకు పెంచి వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలు, దివ్యాంగులను మోసం చేస్తోందని మండిపడ్డారు.



జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం 'ఎమర్జెన్సీ డే' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ కమిషన్ మాజీ సభ్యు డు తల్లోజీ ఆచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన పుప్పాల రాజేందర్, ఉల్సే రాజేశ్వర్, పోల ఆంజనేయులు, జలగం వెంకట్‌రెడ్డి, సిలివేరి శ్రీధర్ భలసాని గోవర్ధన్, ఆర్.రవినాథ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.
–వినాయక్‌నగర్, జూన్ 25

# 'అమ్మ ఒడి' పకడ్బందీగా నిర్వహించాలి

- గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి
- డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్
- ఇందల్వాయి పీహెచ్‌సీ తనిఖీ

రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

ఇందల్వాయి, జూన్ 25: అమ్మ ఒడి పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి సోమ, మంగళవారాలు గర్భిణులకు ఉచిత రక్త పరీక్షలు చేపట్టాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ అన్నారు. మంగళవారం ఆయన ఇందల్వాయి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో హైపర్ టెన్షన్, డయాబెటిస్ రోగులను గుర్తించి, నెలకు సరిపడా మందులను అందజేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా అత్యధికంగా పరీక్షలు చేపడుతూ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, ప్రతి ఒక్కరికీ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. డీఎంహెచ్‌వో వెంట వైద్యాధికారి సందీప్, జిల్లా అసంక్రమిత వ్యాధుల కో–ఆర్డినేటర్ వెంకటేశ్, జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు వెంకటేశ్వర్లు, స్వామి, సులోచన, సురేశ్, నాగరాజు, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి వై.శంకర్, వెంకట్‌రెడ్డి, ఆనంద్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

# దేవాలయాలే హిందూ ధర్మ పరిరక్షణ కేంద్రాలు

**భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతీస్వామి**

ధార్మిక ప్రసంగం చేస్తున్న కమలానంద భారతీ స్వామి

సుభాష్‌నగర్, జూన్ 25: సంస్కృతీ సంప్రదాయాలకు దేవాలయాలే పట్టుగొమ్మలని, హిందూ ధర్మ పరిరక్షణకు కేంద్రాలని భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతీస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని శంభులింగేశ్వరాలయంలో హిందూ దేవాలయ పరిరక్షణ సమితి ఇందూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇందూరు జిల్లాలో దేవాలయాలకు మహోన్నతమైన చరిత్ర ఉందని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. శంభుని గుడి చుట్టూ అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించి ఆలయ పవిత్రతను, దేవాలయాల ఆస్తులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యాక్రమంలో దేవాలయ పరిరక్షణ సమితి కన్వీనర్ పటేల్ ప్రసాద్, జయ్‌పాల్, బంటు ప్రవీణ్, ఆలయ కమిటీ చైర్మన్ లింగం, ఈవో రవీందర్, శ్రీనివాస్ శర్మ, సంజయ్ సంగ్వాయి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## క్లర్క్స్‌కు చేయూత

వినాయక నగర్, జూన్ 25: నిజామాబాద్ అడ్వోకేట్స్ క్లర్క్స్ కు పోస్టల్ బీమా సౌకర్యం కల్పించడం క్లర్క్స్‌కు ఆర్థిక చేదోడుగా నిలుస్తుందని క్లర్క్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకిషన్, ప్రధాన కార్యదర్శి ద్రుపద్ అన్నారు. సీనియర్ న్యాయవాది, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి అడ్వోకేట్స్ క్లర్కులందరికీ తన సొంత డబ్బులు చెల్లించి పోస్టల్‌బీమా కల్పించడం ఆర్థిక ధీమాను కలిగించిందని పేర్కొన్నారు. అనంతరం పోస్టల్ బీమాకు కావాల్సిన డబ్బులను వారికి అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్, ఉపాధ్యక్షుడు రాజు, న్యాయవాదులు మాణిక్‌రాజు, సురేశ్ క్లర్క్స్ సంఘం సభ్యులు రమేశ్, నగేశ్, రాము, శివరాజ్, గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

సిరికొండ, జూన్ 25 : గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవీందర్‌రావు అన్నారు. గుడుంబా విక్రయిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ కానిస్టేబుల్ దత్తు ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ రవీందర్‌రావు ఎదుట బైండోవర్ చేశారు. మండలంలోని గడ్డమీద తండా, నడిమి తండా, ముసిర్‌నగర్, వర్జిన్ తండాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. గుడుంబా తయారుచేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ తెలిపారు.

# 'ఎన్‌సీఎస్‌ఎఫ్'ను పునరుద్ధరించాలి

**గ్రామాల్లో రైతునాయకుల ఇంటింటా ప్రచారం**

సారంగాపూర్, జూన్ 25 : నగరంలోని సారంగాపూర్ సహకార చక్కెర కర్మాగారం(ఎన్‌సీఎస్‌ఎఫ్)ను పునరుద్ధరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం రైతునాయకులు, రైతులు పలు గ్రామాల్లోకి వెళ్లి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం నాయకుడు నాగయ్య ఆధ్వర్యంలో రైతు నాయకులు నిజామాబాద్ మండలంలోని జలాల్‌పూర్, లక్ష్మాపూర్ గ్రామాల్లో రైతులను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సీఎస్‌ఎఫ్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చేందుకు రైతులందరినీ సంఘటితపర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడిపించాలని లేదా రైతు నాయకులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతునాయకులు కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాములు, అశోక్, రాజ్‌కుమార్, ఆస్మాబేగం, సాయినాథ్, గంగామణి పాల్గొన్నారు.

జలాల్‌పూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్, చెరుకు ఉత్పత్తిదారుల సంఘం నాయకులు

## పోతంగల్ తైబజార్ వేలం వాయిదా

పోతంగల్, జూన్ 25: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ప్రత్యేకాధికారి, ఎంపీవో మారుతి అధ్యక్షతన మంగళవారం తైబజార్ వేలం నిర్వహించారు. వార సంతకు రెండు డిపాజిట్లు రాగా, మేకల సంత, రోజువారి సంతకు ఒక్క డిపాజిట్ కూడా రాలేదని తెలిపారు. గ్రామ పంచాయతీ నిర్ణయించిన ధర రాకపోవడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు ఎంపీవో పేర్కొన్నారు. ఈ నెల 27న మరోసారి వేలం నిర్వహిస్తామని తెలిపారు. కార్యదర్శి చంద్రకాంత్, కారోబార్ నగేశ్ పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తేవాలి

సిరికొండ, జూన్ 25: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఉపాధి లేకుండా చేసి వారి పొట్ట కొడుతున్నదని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు రమేశ్ అన్నారు. వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం సమగ్రమైన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దయనీయమైన పరిస్థితుల్లో ఉన్న వ్యవసాయ కూలీలను ప్రత్యేక వర్గంగా గుర్తించి వారి సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమగ్రమైన వ్యవసాయ కార్మిక చట్టం తెచ్చి 50 ఏండ్లు పైబడిన వారికి నెలకు రూ. 10 వేల చొప్పున పెన్షన్ అందించాలని కోరారు. సాయిరెడ్డి, కిశోర్, రమేశ్, దామోదర్, లింబాద్రి పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

డిచ్‌పల్లి, జూన్ 25: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన మారుపక దత్తాద్రి (61) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. దత్తాద్రి సోమవారం మధ్యాహ్నం చేపలు పట్టడానికి ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబీకులు చుట్టపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం ఉదయం డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఖిల్లా డిచ్‌పల్లి చెరువులో దత్తాద్రి మృతదేహం లభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కల్తీకల్లు విక్రయాలపై ఫిర్యాదు

డిచ్‌పల్లి, జూన్ 25: మండలంలోని మిట్టాపల్లి గ్రామంలో స్వామిగౌడ్ తెల్ల కల్లు సొసైటీ ద్వారా కల్తీ కల్లును విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఆయన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో అశాంతికి కారణమవుతున్న స్వామిగౌడ్ అతడి తమ్ముడు శ్రీనివాస్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీతోపాటు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు.

## బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

ధర్పల్లి, జూన్ 25: మండల కేంద్రానికి చెందిన కాసుల సాయిలు పదిహేను రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను వెతికి పట్టుకుని బాధితుడికి మంగళవారం అప్పగించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

## నేడు ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్

డిచ్‌పల్లి/ ఖలీల్‌వాడి, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ నేడు పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బి.శివ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలని, డీఈవో, ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల బంద్‌కు పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఇదిలా ఉండగా బంద్‌పై పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఇప్పటికే మెస్సేజ్‌లను పంపించాయి.

అమెరికా పర్యటన ముగించుకుని మంగళవారం తిరిగి వచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బాల్కొండ నియోజకవర్గం బీఆర్‌ఎస్ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం వేముల ప్రశాంత్‌రెడ్డి ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. – మోర్తాడ్, జూన్ 25

# అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేశా

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

**జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు**

మాక్లూర్,జూన్25: తన సొంత మండలం మాక్లూర్‌కు అత్యధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేశానని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బొంకన్‌పల్లి, ముల్లంగి(బీ) పరిధిలో వెయ్యి ఎకరాలకు నీరందించేందుకు రూ.11.70 కోట్లు మంజూరు చేయించి కొత్తలిఫ్ట్ నిర్మాణం పూర్తి చేయించానని పేర్కొన్నారు. లక్నాపూర్, గంగరమంద, వెంకటాపూర్, ధర్మోరా, మాందాపూర్, గొట్టుముక్కల గ్రామాలకు బీటీ రోడ్లు వేయించానని, పలు పాఠశాలలకు, జీపీలకు నిధులు మంజూరు చేశానని గుర్తుచేశారు. వారం రోజుల్లో గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. గృహజ్యోతి పథకంలో నెలకొన్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు ఎంపీపీ సూచించారు. మాక్లూర్ సొసైటీ పరిధిలో మాదాపూర్, బొంకన్‌పల్లి గ్రామాల్లో గోదాములు నిర్మించకుండానే రూ.34లక్షలు డ్రా చేశారని జడ్పీ చైర్మన్ మండిపడ్డారు. సుతిలీ దారాల కొనుగోలుకు రూ.10లక్షలు ఖర్చు చేయడం విడ్డూరమని, సొసైటీలో గత చైర్మన్ హయాంలో భారీగా కుంభకోణాలు జరిగాయని పత్రికల్లో వచ్చాయని గుర్తుచేశారు. ముందుగా ఒడ్యాట్‌పల్లి సర్పంచ్ రాజేశ్వర్ మృతికి సంతాప సూచకంగా సభ నిమిషం మౌనం పాటించింది. అనంతరం జడ్పీచైర్మన్‌ను సభ్యులు సన్మానించారు. ఎంపీటీసీలను అధికారులు సన్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుక్కి సుజాత, ఎంపీడీవో జైక్రాంతి, తహసీల్దార్ షబ్బీర్, వ్యవసాయ శాఖ అధికారిణి పద్మ, కోఆప్షన్ సభ్యుడు హైమద్, ఎంఈవో రాజగంగారెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏఈలు శ్రీనివాస్, గోపీనాయక్, ఏపీఎం అనిల్ కుమార్, ఏపీవో ఓంకార్, అటవీశాఖ అధికారి అశోక్ పాల్గొన్నారు.

# 'రైతు భరోసా'పై అభిప్రాయాల సేకరణ

**వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మాట్లాడిన రైతులు**

డిచ్‌పల్లి/ఎడపల్లి/ముప్కాల్, జూన్25:

రాష్ట్ర ప్రభుత్వం వానకాలం, యాసంగి సీజన్ ప్రారంభమయ్యే ముందు రైతుభరోసా ఇవ్వాలని రైతులు కోరారు. 'రైతు భరోసా'పై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన సబ్ కమిటీ రైతుల అభిప్రాయాలనుసేకరిస్తోంది. ఇందులో భాగంగా డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లితోపాటు ముప్కాల్, ఎడపల్లి మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో నియోజకవర్గాల రైతుల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో మెంట్రాజ్‌పల్లిలో ఏడీఏ ప్రదీప్‌కుమార్, ఏవో రాంబాబు, విండో చైర్మన్లు రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమం ద్వారా మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 100 రైతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ హాజరై బోధన్ నియోజకవర్గ రైతుల అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా స్వీకరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పోలమల్కారెడ్డి, నాయకులు ఎల్లయ్య యాదవ్, జనగం మోహన్ రెడ్డి, ఏవో సిద్ది రామేశ్వర్ పాల్గొన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు పాల్గొన్నట్లు భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గ రైతులు వారి అభిప్రాయాలను తెలిపారని పేర్కొన్నారు.

ముప్కాల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో..

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, NALLA GANGAMANI (Old Name) D/o. NALLA BHUMMANNA Changed My surname/ Name BOIDI PALLAVI W/o. BOIDI SHASHIDER R/o. H.No. 7-95/20, Vil: Thimmapur, Mdl: Morthad, Dist. Nizamabad. T.S.
NTZ-324947

పాస్‌పోర్ట్ పోయినది

★MALYALA KARTHIK S/o GANGARAM H.NO: 1-5/2,కోనాపూర్, మం: కమ్మర్‌పల్లి, జి॥ నిజామాబాద్ . నా పాస్‌పోర్ట్ నెం.U7460536 కలది బైక్ పై కోనాపూర్ నుండి కమ్మర్‌పల్లి వెళ్ళుచుండగా పోయినది. ఎవరికైన దొరికినచో సం: సెల్:7993568747
NTZ-324946

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## డీవీ కృష్ణ ఆశయసాధనకు కృషి చేయాలి

బోధన్/మోర్తాడ్, జూన్ 25: ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త డీవీ కృష్ణ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు వి.ప్రభాకర్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీవీ కృష్ణ జ్ఞాపకార్థం జిల్లా కేంద్రంలో ఆయన స్మారకస్తూపం ఈనెల 26న ఆవిష్కరిస్తామని, ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.డీవీ కృష్ణ వర్ధంతి సభ, స్తూపం ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు కిషన్ కోరారు. మోర్తాడ్ మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజేశ్వర్, మజీద్, దుర్గయ్య, చిన్నక్క, నర్సయ్య, పోశెట్టి, దయాల్ సింగ్, గంగారాం పాల్గొన్నారు.

## నిర్మాణ పనుల పరిశీలన

భీమ్‌గల్, జూన్ 25: మండలంలోని చేంగల్ గ్రామంలో స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కొనసాగుతున్న నిర్మాణ పనులను ఎంపీడీవో సంతోష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పురోగతి పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శితో గ్రామంలో పారిశుద్ధ్యంపై సమీక్ష నిర్వహించారు. బడాభీమ్‌గల్‌లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించామని అన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని ఇండ్ల సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో గంగామోహన్, ఏపీవో నర్సయ్య, టెక్నికల్ అసిస్టెంట్ గణేశ్, సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నారు.

## పిరమిడ్‌ను స్వాధీనం చేసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, జూన్25: నవనాథ సిద్దుల గుట్టపై నిర్మించిన పిరమిడ్ కట్టడాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని హిందూ పరిరక్షణ సమితి నవనాథపురం సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ గజానన్‌కు మంగళవారం వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఆసంఘం సభ్యులు డీజే శ్రీధర్, కలిగోట ప్రశాంత్ మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం నవనాథ సిద్దుల గుట్టపై అక్రమంగా పిరమిడ్(పత్రిజీ) నిర్మించారని, ఇందులో విగ్రహాన్ని ఏర్పాటు చేయకుండా హిందువు మనోభావాలను దెబ్బ తీస్తున్నారని అన్నారు. సిద్దుల గుట్ట ఎటువంటి నిర్మాణాలు జరిగినా హిందు ధ్వజం (కషాయ జెండా), ప్రతి కట్టడం లోపల హిందూ విగ్రహాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలని అన్నారు. లేని యెడల ఆ నిర్మాణాలను సిద్దుల గుట్ట ఆలయ కమిటీకి లేదా దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందూ పరిరక్షణ కమిటీ నవనాథపురం సభ్యులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

శక్కర్‌నగర్/ఆర్మూర్‌టౌన్, జూన్ 25: విద్యాసంస్థల్లోకి వెళ్లి ఇబ్బందులకు గురిచేసే వారిపై చర్యలు చేపడతామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బంద్ పేరుతో కానీ, ఇతర కారణాలతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వారి విధులకు అంతరాయం కలిగిస్తే విద్యార్థి సంఘాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాసంస్థలపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఉన్నతాధికారులకు లేదా పోలీస్ అధికారులకు ఫిర్యాదు ఇవ్వవచ్చని తెలిపారు.

## పింఛన్ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

వేల్పూర్, జూన్ 25: దివ్యాంగులు, ఇంటి వద్ద బెడ్ రెస్ట్‌లో ఉన్న వారికి సిబ్బందితో పింఛన్ డబ్బులు పంపిణీ చేయాలని మాజీ ఉపసర్పంచ్ పిట్ల సత్యం, ఎంపీటీసీ మొండి మహేశ్ కోరారు. మంగళవారం స్థానిక పోస్టాఫీస్‌లో అధికారులతో మాట్లాడారు. పోస్టాఫీస్ వద్ద పింఛన్‌దారులకు తాగునీరు, నీడ కోసం ఏర్పాట్లు చేయాలని కోరుతూ పింఛన్‌దారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎంపీడీవో, వేల్పూర్ గ్రామ స్పెషల్ ఆఫీసర్, గ్రామపంచాయతీ సెక్రటరీకి విన్నవించామని పేర్కొన్నారు.

## బీటీరోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపితే చర్యలు

నవీపేట,జూన్ 25: బీటీ రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లను నడిపితే కేసుల నమోదుతోపాటు జరిమానా విధించి డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ట్రాక్టర్లకు పట్టీలు తొడిగి పొలాల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

## సంక్షిప్తంగా..

- **ప్రొసీడింగ్ పత్రం అందజేత -** మాక్లూర్, జూన్25: మండలంలోని గంగరమంద గ్రామంలోని వంజరి సంఘం కమ్యూనిటీ భవనం వద్ద బోరు బావి తవ్వేందుకు జడ్పీ నిధుల నుంచి రూ.50 వేలు జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మంజూరు చేశారు. ప్రొసీడింగ్ పత్రాన్ని వంజరి సంఘం సభ్యులకు మంగళవారం అందజేశారు. జడ్పీ చైర్మన్‌కు, ఎంపీపీ ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అనుగు గంగాధర్, ప్రసాద్, వీడీసీ అధ్యక్షుడు కరిపె రాజు పాల్గొన్నారు.
- **ఏఐఎస్‌బీ వార్షికోత్సవం -** శక్కర్‌నగర్, జూన్ 25: బోధన్ పట్టణంలోని ఎస్సీ బాయ్స్ వసతి గృహం వద్ద మంగళవారం ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ (విద్యార్థి సంఘం) 74వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవర్ల నాగరాజు సంఘం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి రాజన్న, గంగా ప్రసాద్, శ్రీను, అన్వేష్, లక్ష్మణ్, మహేశ్ పాల్గొన్నారు.
- **విజయవంతం చేయాలి-** మాక్లూర్, జూన్ 25: మానిక్‌బండార్‌లో మంగళవారం అఖిల భారత రైతుకూలీ సంఘం జనరల్ కౌన్సిలింగ్ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆసంఘం నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్డు గంగాధర్ మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కల్తీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలని కోరారు.
- **క్షీరాభిషేకం -** బోధన్ రూరల్/ఎడపల్లి, జూన్ 25: రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మంగళవారం సాలూరా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డి సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.
- **బండి సంజయ్‌ని కలిసిన కోటపాటి-** ఆర్మూర్‌టౌన్, జూన్25: కేంద్రమంత్రి బండి సంజయ్‌ని హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఆర్మూర్‌కు చెందిన సీనియర్ నాయకుడు కోటపాటి నరసింహనాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.
- **వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి-** ఆర్మూర్‌టౌన్, జూన్25: వానకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో సాయిరాం కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్, పినాయిల్, ఫాగింగ్ మిషన్ అందుబాటులో ఉంచామన్నారు.
- **పాఠశాలల్లో పనులు వేగవంతం చేయాలి-** రెంజల్, జూన్ 25: అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో ఎంపికైన పాఠశాలల్లో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ గుత్తేదార్లను ఆదేశించారు. మంగళవారం రెంజల్, దండిగుట్ట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీటి సౌకర్యం పనులు ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట జీపీ కార్యదర్శులు రాజేందర్‌రావు, గౌతమి, సిబ్బంది ఉన్నారు.
- **విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ-** బోధన్ రూరల్, జూన్ 25: సాలూర మండలంలోని తగ్గెల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మంగళవారం ప్లేట్లను పంపిణీ చేశారు. హెచ్ఎం దాసరి ధన్‌రాజ్ తండ్రి జ్ఞాపకార్థం డీఎస్‌ఆర్ ఫౌండేషన్ తరపున 75 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు.